

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తదితరులు

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

● హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

హయత్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ నార్కోటిక్స్ బ్యూరో ఆదేశాల మేరకు సోమవారం హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు డ్రగ్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ నర్సింహ, మధు, ఇందిర, యాదగిరిరెడ్డి, శారద, యాదయ్య, అనిత, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్‌లో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విజయవాడ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. దీంతో కొద్దిసేపు జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినప్పటికీ నిధులను విడుదల చేయకపోవడం దారుణం అన్నారు. పెండింగ్‌లో ఉన్న 8,792 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, రోహిత్, మహేష్, నితిన్, చితేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చంపాపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన ఇరువురు విద్యార్థులు కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి స్వర్ణ, కాంశ్య పతకాలు సాధించారు. ఇటీవల మలేషియాలో నిర్వహించిన 9వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ కేఎల్ మేయర్స్ కప్ -2024 పోటీల్లో పాఠశాలకు చెందిన రమావత్ శాన్వినాయక్ (అండర్ 8,9 విభాగంలో)స్వర్ణ, కాంశ్య పతకం, ప్రణవ్(అండర్ 12,13 విభాగంలో) స్వర్ణ పతకం సాధించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి విద్యార్థులకు బొకేలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ జి.రజిని విఠల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, ప్రిన్సిపాల్ విజయకుమార్‌రావు, కరాటే అకాడమిక్ కోచ్‌లు రాజానాయక్, ఈశ్వర్‌నాయక్, కిషోర్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో ప్రజల ఇబ్బందులు

మన్సూరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను సరిగా అమలు చేయకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్, మత రాజకీయాలను రెచ్చగొడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కడిగల భాస్కర్, కార్యదర్శి వర్గసభ్యులు పగడాల యాదయ్య ఆరోపించారు. సీపీఐ హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మహాసభను సోమవారం మన్సూరాబాద్ జడ్జెస్‌కాలనీ శివాజీ పార్కు కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన భాస్కర్, యాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని, ముఖ్యంగా అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. అనంతరం సర్కిల్ మహాసభలో 9మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా కార్యదర్శిగా కీసరి నర్సిరెడ్డి, సభ్యులుగా సీహెచ్ కృష్ణయ్య, సీహెచ్ మల్లేశం, బూరెల్లి భాస్కర్, తిరుమల సంధ్య, కొత్త గణేష్‌గౌడ్, దోనూరు కృష్ణారెడ్డి, జక్కిడి అనిల్‌రెడ్డి, కనకయ్య ఎన్నికయ్యారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పారిజాతారెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 2వ డివిజన్‌లో కొత్తగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ జెనిగె పద్మాఐలయ్యయాదవ్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ జ్యోతీరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, నాయకులు రామిడి వీరకర్ణారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీఆర్ఆర్ ఎన్‌క్లేవ్ నూతన కార్యవర్గం

కాలనీ పార్కు స్థలాన్ని కాపాడుకుంటాం

సరూర్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో ప్రజోపయోగార్థం లేఅవుట్‌లో వదిలేసిన పార్కు స్థలాన్ని కాపాడుకుని, వీలైనంత తొందరగా అక్కడ పార్కు నిర్మాణం చేపడతామని బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని బీఆర్ఆర్ ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రకటించింది. కాలనీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఇదే..

నూతన కార్యవర్గంలో చైర్మన్‌గా రవీందర్, అధ్యక్షుడిగా జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా కవిత, కోశాధికారిగా వినోబాచారి, ఉపాధ్యక్షులుగా వేణుమాధవరావు, మధు, రామసూర్యం, సంయుక్త కార్యదర్శులుగా శ్రావణ్‌కుమార్, సాయికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు మహేశ్, గోపీకృష్ణ, సాంస్కృతిక కార్యదర్శులుగా గాయత్రి, భార్గవి, సలహాదారులుగా విజయ్‌కుమార్, నర్సింహశాస్త్రి, హన్మంత్‌రావుతో పాటు మరో తొమ్మిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఏసీపీ కృష్ణయ్యకు మంత్రి పొన్నం పరామర్శ

మన్సూరాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా కొన్ని రోజులుగా కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యని తెలంగాణ రాష్ట్ర రోడ్డు, రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పరామర్శించి ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏసీపీ ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులతో చర్చించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ఏసీపీ కుటుంబ సభ్యులతో మాట్లాడిన పొన్నం వారికి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి తదితరులు ఉన్నారు.



వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు తదితరులు



సలీంనగర్ చౌరస్తాలో సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



బీపీ పరీక్షలు చేయించుకుంటున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన సోనియా

● జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నేతలు

ఎల్బీనగర్, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోనియాగాంధీ జన్మదినోత్సవాన్ని ఆర్‌కేపురం టెలిఫోన్‌కాలనీలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తీగల అనితారెడ్డి, పున్న నిర్మల, చిలుక ఉపేందర్‌రెడ్డిలతో కలిసి కేఎల్ఆర్ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచి ఎంతోమంది బలిదానాలు చేశారన్నారు. బలిదానాలను చూసి చలించిన సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించి ఏర్పాటు చేసిందన్నారు. యావత్ తెలంగాణ సోనియాగాంధీకి రుణపడి ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రాగానే నియామకాలపై దృష్టి సారించి వేలాది ఉద్యోగ నియామకాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తీగల అనితారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, రఘుపతి, పున్న నిర్మల గణేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్, లక్ష్మి, గట్ల రవీంద్ర, జగన్నాథం, ఎన్ఎస్‌యూఐ శివ, భూపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, మారం సుజాత, ఖిల్లా మైసమ్మ ఆలయ చైర్మన్ సురేందర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఆర్‌కేపురం అధ్యక్షుడు పున్న గణేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తీగల అనితారెడ్డి

వాసవీకాలనీలో..

ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వాసవీకాలనీలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి కేక్ కట్‌చేసి సంబరాలు ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బందం దామోదర్, ప్రధాన కార్యదర్శి వూటూరి రామ్, కిషన్, టి, సుభాకర్‌రావు, పీవీ మనోహర్‌రావు, కృష్ణమూర్తి, బాలయ్య, లింగస్వామిగౌడ్, బ్రహ్మానందం, నాగమణి, హైమావతి పాల్గొన్నారు.

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో..

వనస్థలిపురం : సోనియాగాంధీ జన్మదిన వేడుకలు హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, పాశం అశోక్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ఘనంగా జరిగాయి. ఈ మేరకు ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు, ఇతర ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కట్ల నర్సింహయాదవ్, నాయకులు కొలను సుధాకర్‌గౌడ్, రమేష్, ప్రగతి, భుజంగరెడ్డి, పద్మారెడ్డి, మధు, వెంకటేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్ : సోనియాగాంధీ కృషితోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాకారం అయిందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో మలక్‌పేట యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పెషలిస్ట్ వైద్యులతో రైతులు, హమాలీలు, వర్తకులు, మార్కెట్ సిబ్బందికి కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీతో పాటు జనరల్ పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మార్కెట్ డైరెక్టర్లు రఘుపతిరెడ్డి, అంజయ్య, గణేష్‌నాయక్, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, డాక్టర్లు అరవింద్, మౌనిక, ఉమాదేవి, సూర్య, వాసుకిరణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

తుర్కయంజాల్ చౌరస్తాలో..

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను తుర్కయంజాల్ చౌరస్తాలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొత్తకుర్మ మంగమ్మ కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెంటారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశిక ఐలయ్య, సీనియర్ నాయకులు భాస్కర్‌రావు, గుడ్ల అర్జున్, శ్యామల, శ్రీనివాస్, కిషన్, రవి, సైదులు పాల్గొన్నారు.

తెలంగాణలో మరో తొమ్మిదేళ్లు ప్రజాపాలన ఖాయం

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత

● ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

సరూర్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మరో తొమ్మిదేళ్లపాటు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాపాలన కొనసాగి తీరుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ కొలువుదీరి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం బడంగ్‌పేట్‌లోని గ్రీన్‌రిచ్ ఎవెన్యూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోనియా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులకుప్పగా మారితే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులను అధిగమిస్తూ దశలవారీగా ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, నరహరిగౌడ్, రమేశ్‌గౌడ్, మనోహర్, శ్యాంసుందర్‌రెడ్డి, కొండా శ్రావణ్‌కుమార్, రమాకాంత్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొన్న కేఎల్లార్

మల్లాపూర్‌లో..

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా టీపీసీసీ కార్యదర్శి వై.అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్ చౌరస్తాల్లో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ నిజమైన ప్రజా పాలన అందిస్తున్నదని, గత పాలకుల అవినీతి కారణంగా రాష్ట్రం అప్పులపాలయిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, అచ్చన శ్రీనివాస్, కృష్ణ, పుట్టగల్ల జగన్, జంగయ్య, సత్యనారాయణ, ఆంజనేయులు, శ్రీధర్, మహ్మద్‌బామ్, యూసుఫ్ పటేల్ పాల్గొన్నారు.

బినామీ ఆస్తులను కాపాడుకునేందుకే ఆర్ఎస్ ప్రవీణ్ తాపత్రయం

● బీజేపీ నేతలు

ఎల్బీనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీనామీ పేర్ల మీద ఉన్న కోట్లాది రూపాయల ఆస్తులను కాపాడుకునేందుకే బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తాపత్రయ పడుతున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ధీరజ్‌రెడ్డి, జంగయ్యయాదవ్, కార్పొరేటర్ రంగానర్సింహగుప్తా, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. సోమవారం ఆర్‌కేపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీనామీలపేరిట కోట్లాది రూపాయల ఆస్తులను కూడబెట్టుకున్నారని వాటిని కాపాడుకునేందుకే హనుమయ్య వ్యక్తిగత విషయానికి రాజకీయ రంగు పులుముతున్నారని ఆరోపించారు. అనేక మంది పెద్దపెద్ద కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్న హనుమయ్య బీఆర్ఎస్ నాయకుడే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బినామీ అని అన్నారు. మర్రిగూడ మండలం కుదాబక్షిపల్లి గ్రామంలో సుమారు 750 ఎకరాల స్థలం, యాదాద్రి జిల్లా రాజపేట మండలంలో సుమారు 90 ఎకరాల స్థలం హనుమయ్య అతని కుటుంబ సభ్యుల పేర్ల మీద ఉన్నాయని తెలిపారు. ఆయా భూములు కూడా దళితులను, గిరిజనులను భయభ్రాంతులకు గురిచేసి, మోసం చేసి లాక్కున్నారని ఆరోపించారు. హనుమయ్య భూములు లాక్కోవడంతో కొందరు ఆత్మహత్య కూడా చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బినామీ కావడం వల్లే హనుమయ్య అతని కుటుంబ సభ్యుల పేరిట వందలాది ఎకరాల స్థలాలు ఉన్నాయన్నారు. ధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పనులకు సంబంధించి హనుమయ్యకు తనతో నేరుగా ఎలాంటి సంబంధం లేదన్నారు. రెండు రోజుల క్రితం హనుమయ్య తన అనుచరులతో కలిసి మా కార్యాలయానికి వచ్చి నాపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. అనేకసార్లు హనుమయ్య నాకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు. వ్యాపార లావాదేవిలకు సంబంధించిన విషయంలో ప్రవీణ్‌కుమార్ ఆగమేఘాల మీద వచ్చి తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తు తన బినామీలను కాపాడుకోవడానికి తాపత్రయపడుతున్నారని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారిగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్ నిజానిజాలు తెలుసుకోకుండానే కేవలం బినామీల పేరిట ఉన్న ఆస్తులను కాపాడుకోవడం కోసం మాత్రమే ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు సామ రంగారెడ్డి, ధీరజ్‌రెడ్డి, రంగానర్సింహగుప్తా, జంగయ్యయాదవ్

హనుమయ్యపై హత్యాయత్నానికి పాల్పడిన ధీరజ్‌రెడ్డిని అరెస్టు చేయాలి

● చైతన్యపురి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాలో హనుమయ్య కూతురు ఉషా డిమాండ్

చాదర్‌ఘాట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చేసిన కాంట్రాక్ట్‌కు సంబంధించిన బిల్లులను చెల్లించాలని అడిగేందుకు వెళ్లిన తన తండ్రి హనుమయ్యతోపాటు మరో ఐదుగురిపై దాడికి పాల్పడిన బీజేపీ నాయకుడు ధీరజ్‌రెడ్డితోపాటు అతని అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ హనుమయ్య కూతురు ఉషాతోపాటు పలువురు బీఆర్ఎస్ మహిళ కార్యకర్తలు సోమవారం చైతన్యపురి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా హనుమయ్య కూతురు ఉషా మాట్లాడుతూ తన తండ్రికి రావాల్సిన బకాయిలను అడిగేందుకు వెళ్తే డబ్బులు చెల్లించకపోగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన బీజేపీ నాయకుడు ధీరజ్‌రెడ్డిపై నామమాత్రం కేసులు పెట్టి చైతన్యపురి పోలీసులు కేసును నీరు గార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దాడిలో గాయపడిన తన తండ్రి హనుమయ్య ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. హనుమయ్యపై దాడి జరిగిన తర్వాత అతని దుస్తులను మార్చేందుకు షాపులో కొనుగోలు చేసిన కొత్త దుస్తులకు సంబంధించిన రసీదును ఆమె ధర్నాలో చూపించారు. హనుమయ్యపై దాడి జరిగిన తర్వాత రక్తపు మరకలు ఉన్న దుస్తులను మార్చిన విషయాన్ని పోలీసులు గుర్తించకుండానే కేసు నమోదు చేయడాన్ని ఆమె తప్పు బట్టారు. కేసును పోలీసులు నీరు గార్చేందుకు ప్రయత్నిస్తుండడం వల్లే తాను ధర్నాకి దిగి వాస్తవాలను తెలియజేసినట్లు తెలిపారు. చైతన్యపురి పోలీసులు తక్షణమే కేసుల్లోని సెక్షన్లలో మార్పులు చేయడంతోపాటు ధీరజ్‌రెడ్డితోపాటు అతని అనుచరులందరిని తక్షణమే అరెస్టు చేయాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని ఉషా స్పష్టం చేశారు.



ధర్నాలో హనుమయ్య కూతురు ఉషా, బీఆర్ఎస్ మహిళ కార్యకర్తలు

తాపీమేస్త్రీ అదృశ్యం

హయత్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తాపీ మేస్త్రీ అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ కట్టమైసమ్మ కాలనీలో నివాసం ఉండే తాపీ మేస్త్రీ యాకయ్య(33) గత గురువారం ఉదయం 8గంటలకు మేస్త్రీ పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంత వరకు రాకపోవడంతో భార్య చుట్టుపక్కల, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో యాకయ్య భార్య రమాదేవి సోమవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నేత ధీరజ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చాదర్‌ఘాట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీల విషయంలో తలెత్తిన వివాదంలో కాంట్రాక్టర్ హనుమయ్యపై దాడికి పాల్పడిన బీజేపీ నాయకుడు ధీరజ్‌రెడ్డిని చైతన్యపురి పోలీసులు సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. హనుమయ్య కూతురు ఉషా బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలతో కలిసి సోమవారం ఉదయం చైతన్యపురి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు ధీరజ్‌రెడ్డి కార్యాలయానికి వెళ్లి హనుమయ్యపై దాడి ఘటనపై విచారణ నిమిత్తం ధీరజ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ధీరజ్‌రెడ్డిని ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి తరలించారు. హనుమయ్యపై దాడికి ప్రధాన కారణం ఆర్థిక లావాదేవీలేనని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా తాను ఎవరిపై దాడి చేయలేదని ధీరజ్‌రెడ్డి పోలీసులకు వివరించారు. హనుమయ్య తనను ఫోన్‌లో బెదిరించారని ఆ సమాచారాన్ని పోలీసులకు కూడా ఆయన అందించారు. ఈనెల ఏడో తేదీన పరస్పరం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో హనుమయ్య, ధీరజ్‌రెడ్డిలు ఫిర్యాదు చేసుకున్నారని ఎల్బీనగర్ జోన్ అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు తెలిపారు. ఇరువురి ఫిర్యాదులను చైతన్యపురి పోలీసులు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వివరించారు.

బ్రాహ్మణ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

ఎల్బీనగర్, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, బ్రాహ్మణుల ప్రగతి కోసం నిర్వహించబోయే బ్రాహ్మణ సమ్మేళనానికి యావత్ బ్రాహ్మణ బంధువులంతా హాజరై విజయవంతం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు బీఆర్‌వీ సుశీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తపేటలోని ఏబీ6 అసోసియేషన్ కార్యాలయంలో బ్రాహ్మణ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణ్స్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఈ మహాసమ్మేళనానికి ఈనెల 15న ఆబిడ్స్‌లోని రాఘవరత్న టవర్స్‌లో ఉన్న మైనింగ్స్ అసోసియేషన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 29న రవీంద్రభారతి వేదికగా బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, మన ప్రభుత్వం మన ప్రగతి పేరుతో జరుగనున్న మహాసమ్మేళనంలో అతిథులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దూపదీప నైవేద్య పథకం అధ్యక్షుడు వాసుదేవశర్మ, బ్రాహ్మణ సంఘం నాయకులు పోచంపల్లి రమణారావు, కోశాధికారి విద్యావతి, ఆహ్వాన కమిటీ కన్వీనర్ రాంచందర్‌రావు, విష్ణుదాస్ శ్రీకాంత్, డాక్టర్ ప్రియదర్శిని, వేదాంతం పవన్‌కుమార్, పెండ్యాల వైద్యనాథ్‌రావు, భానుశర్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో ముందుండాలి

కొత్తపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో ముందుండాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. సోమవారం జిల్లెలగూడలో గల లార్డ్స్ టాలెంట్ స్కూల్ నుంచి 40 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ పోచంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ స్కూల్, టీజీ జూనియర్ కళాశాల, టీజీ మోడల్ జూనియర్ కాలేజీ, పిట్లాపురం, భూదాన్‌పోచంపల్లిలలోని జడ్‌పీహెచ్ఎస్‌లలోని విద్యార్థులకు, ఎల్బీనగర్ కామినేని చౌరస్తా, అల్కాపురిచౌరస్తాల్లో ప్రజలకూ టీటీఐ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు.

14 కార్యక్రమాల్లో 965 మంది విద్యార్థులకు అవగాహన

14 కార్యక్రమాల్లో 965మంది విద్యార్థులకు, ప్రజలకూ ట్రాఫిక్ నిబంధనలను పరిచయం చేశారన్నారు. కళాశాలల్లో చదివే విద్యార్థులు నిబంధనలను పాటించడంతో పాటు ఇతరులకు పరిచయం చేయాలని కోరారు. టీటీఐ లెక్చర్ హాల్‌లో 5 డీడీ కౌన్సెలింగ్ సెషన్స్‌లో 102 మంది పాల్గొన్నారు. కాక్రమాల్లో టీటీఐ విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం : కేసు నమోదు

హయత్‌నగర్ : ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను దుర్భాషలాడి బస్సు అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం హయత్‌నగర్-2 డిపోకు చెందిన బస్సు బాచారం గ్రామం నుంచి అఫ్జల్‌గంజ్‌కు వెళ్తుంది. బస్సు హయత్‌నగర్ బస్టాండ్ వద్దకు రాగానే నితీష్‌రెడ్డి అనే వ్యక్తి బస్సుకు అడ్డు వచ్చి డ్రైవర్‌తో గొడవపడ్డాడు. కుంట్లూర్‌లో బస్సు ఆపకుండా ఎందుకు వచ్చావు అంటూ డ్రైవర్‌తో గొడవపడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. తీవ్ర ఆగ్రహానికి లోనైన నితీష్‌రెడ్డి తన వెంట తెచ్చుకున్న కర్రతో బస్సు ముందు అద్దాలను ధ్వంసం చేశారు. వెంటనే డ్రైవర్ భీంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన విధులకు ఆటంకం కలిగించి, బస్సు అద్దాలు ధ్వంసం చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

గంజాయి కొనుగోలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

● పది కేజీల గంజాయి స్వాధీనం

వనస్థలిపురం: గంజాయి కొనుగోలు చేస్తున్న పాత నేరస్థుడిని పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వనస్థలిపురం హైకోర్టు కాలనీకి చెందిన సాయికృష్ణ(33) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో గంజాయి విక్ర యించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో సాయికృష్ణకు పాత పరిచయమైన ఖమ్మంకు చెందిన రాజు అనే వ్యక్తితో సాయికృష్ణ ఖమ్మం నుంచి సుమారు లక్ష రూపాయలు విలువ చేసే పది కిలోల గంజాయిని ఆదివారం రాత్రి హయత్‌నగర్‌కు తెప్పించాడు. కాగా సోమవారం ఉదయం పెద్దఅంబర్‌పేట్‌లోని ఓఆర్ఆర్ వద్ద రాజును సాయికృష్ణ తన కారు(ఏపీ 28బీకే 1111)లో ఎక్కించుకుని ఇంజాపూర్‌కు వచ్చాడు. రాజు వద్ద ఉన్న పది కేజీల గంజాయిని సాయికృష్ణ ఖరీదుచేసి తీసుకెళ్తున్నాడని పోలీసులకు విశ్వాసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్వోటీ పోలీసుల సహకారంతో వనస్థలిపురం పోలీసులు ఇంజాపూర్ వద్ద సాయికృష్ణను అదుపులోకి తీసుకుని గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అప్పటికే అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయిన రాజు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా సాయికృష్ణ 2022లో గంజాయిని విక్రయిస్తుండగా మిర్యాలగూడ పోలీసులు అరెస్టు చేయడంతో జైలుకు వెళ్లి వచ్చినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.